# భయం


నంబూరి వెంకటేశ్వరరావు

**అయిదున్నరకు మెలకువ వచ్చింది లక్ష్మికి. రాత్రంతా నిద్రలేదు. తెల్లారగట్ల ఎప్పుడో కళ్లుమూతలు పడ్డాయి. రాత్రంతా కరెంటు లేదు. అన్ని తలుపులూ, కిటికీలూ మూసి గడియలు పెట్టి వుంచినా బయట జరిగే బీభత్సం తెలుస్తూనే ఉంది. గాలి భయంకరంగా వీస్తూనే ఉంది. ఊపిరితీసుకుంటున్నట్లు మధ్యలో క్షణం విరామం. సృష్టిలో జీవమంతా నశించిపోయినట్లనిపించేసి ఆ విరామకాలాల నిశ్శబ్దాలకు, ప్రచండంగా వీచేగాలి భయకంపితం చేస్తుందంటే అర్థం ఉంది; నిశ్శబ్దం ఎక్కువ భయాన్ని ఎందుకు కలిగిస్తుందో! కొండల పక్కన ఉంది ఇల్లు. దక్షిణాన ఉన్న సముద్రం మీదినించి గాలి వచ్చి, ఇటుపక్కల కొండలలో చిక్కుకుని ఉక్కిరిబిక్కిరి అవుతుంది. శత్రువులకు దొరికిపోయి, దారీతెన్నూ కనబడక, పారిపోయే ప్రయత్నంలో భయాన్ని వీడి, తెగింపుతో బుసలు కొట్టే మహాసర్పంలా తోస్తుందది.**

పిల్లలను నిద్రలేవగొట్టి ,ఆరున్నరకల్లా కాలేజీలకు బయలుదేరేట్లు చెయ్యాలి. చదువంటే వాళ్లకు శ్రద్ధ లేదని ఆమె బాధ. వాళ్ల భవిష్యత్తు ఎట్లా ఉంటుందో నని ఆమెకు బెంగ,భయం. ఉంటాయా ఈ రోజు కళాశాలలు.? నిన్న మధ్యాహ్నంనించి కొందరిని, గంట మాత్రం వుంచి మరికొందరిని పంపేశారు కాలేజీల వాళ్లు. ఈ రోజు ఉండవేమో! ఒక వేళ ఉంటే? ఈ పెనుతుపానులో వీళ్లెట్లా వెడతారు. ఈ కొండల చేరువనుంచి అంతంత దూరాలకు వెళ్లడం మరీ కష్టం. బస్సులు నడుస్తాయన్న నమ్మకమూ లేదు. ముగ్గురినీ లేపుతోంది.

"మీకు చదువులక్కరలేదా? మీఅంతట మీరు పొద్దున్నలేవాలని తెలీదా? కాయకష్టానికి ఎలానూ పనికిరారు. చదువులూ అబ్బడంలేదు. ఎలా బతుకుతాం అన్న భయంలేదే! ఆ భయంలేని పిల్లలు ఎందుకూ పనికిరాకుండాపోతారు."






భార్య గొంతు వినిపిస్తోంది శేషా ద్రికి. అవును...కొన్ని జీవిత సందర్భా లలో భయం ఉపయోగపడుతుంది. రాత్రంతా తుపాను హడావుడీ తెలు స్తూనే ఉంది, మెళకువ వచ్చిన ప్పుడ ల్లా. అప్పుడు ఈ ప్రళయం గడిచి, బతికిబట్టకడతామా అన్న అనుమా నం వచ్చేది. తుపానంటే చిన్నప్పటినించి అతనికి భయం. తుపాను వేళ పుట్టడం వల్లనేమో, పెద్ద యినా అది పోకుండా ఉండిపోయింది. గత పదేళ్ల లో ఇలాంటి గాలివాన చూడలేదు. ఇంకా ఎక్కువ గా ఇళ్లు లేవని ఈ ప్రాంతంలో కష్టానికీ, సుఖానికీ పలికే మనుషులు లేరు.

"ఇదిగో, ఈ ప్రళయంలో చదువులు చెప్పే వాళ్లుండరు. ఒకవేళ ఏ పిచ్చాడో సాహసించినా, నీళ్లు వెళ్లకపోతే ఆకాశం బద్దలవ్వదు. అంచేతవాళ్లని ఇంట్లో ఏడవనీ. ఎక్కడో చిక్కుకుపోతే నే వెళ్లి వాళ్లను వెదికి తేలేను" నంగినంగిగా నిద్రమంచం మీదినించి అరిచాడు.

"మీరన్నా ఆఫీసుకు వెళతారా సెలవుచ్చుకుం టారా? "హాల్లో నుంచి పడకగదిలోకి వినబడేలా, అదే డెసిబెల్ లెవల్లో ప్రశ్నించింది. ఈ విషయం ఇలా తన మనసులో మెదలడం ఆరంభమయిందో లేదో అతీంద్రియశక్తి సంపాదించినట్టు అదే విష యాన్ని ప్రస్తావిస్తోంది ఆమె. ఎటూ తేల్చుకోలేక, వినబడనట్లు, సమాధానం ఇవ్వకుండా దాటేయ జూశాను.

"మిమ్మల్నే, వినబడుతోందా?" వినబడింద న్న విషయం ఆమెకూ తెలుసు.

"ఇంకా ఏమీ నిర్ణయించుకోలేదు."

"ఇదేం జాతీయసమస్యా అంతలా ఆలోచించి నిర్ణయం తీసుకోటానికి?" మంచం దగ్గిరకు వచ్చి నిలేసింది.

"అలాంటి సమస్యయితే ఆలోచించవలసిన పనీ లేదు, నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరమూ లేదు"

మంచంమీది నించి లేచి హాల్లోకి వెళ్లాడు.

"తమ్ముడూ చూడు....ఆ కొండమీద చెట్లు ట్రైబల్స్‌లా చెట్టాపట్టాలేసుకుని నాట్యం చేస్తున్నట్లు ఎలా ఊగిపోతున్నాయో!" అమ్మాయి అంటోంది.

"రాత్రి ఏడుగంటలప్పటిలా ఉంది చీకటి. బాబోయ్! నాకు భయమేస్తోంది! ఆ తుపాను ఊరి ని ముంచేస్తుందేమో!"ఆఖరువాడు అన్నాడు.

పెద్దవాడూ వాళ్లిద్దర్ని చేరి కిటికీ ప్లెయిన్‌గ్లాసులోంచి బయటికి చూస్తూ దగ్గు తున్నాడు. రుమాలుతో ముక్కు తుడుచు

## గమనిక

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురణకై పంపే రచనలు, కార్టూన్లు, ఫోటోలు తిరుగు పోస్టేజీ జత చేయకుండా, తరువాత కొంతకాలానికి పంపి, ఎంపిక కానివి తిప్పిపంపమని కొందరు కోరుతున్నారు. ఈవిధమైన రచనలు తిప్పి పంపడం సాధ్యం కాదని మనవి. ప్రచురణకై పంపేవి అన్నీ కూడా తిరుగు పోస్టేజీ జత చేసి పంపాలి. పోస్టేజీ జత చేయనిపక్షంలో ప్రచురణ యోగ్యతలేనివి తిప్పి పంపే బాధ్యత వహించడం వీలుపడదు.

-ఎడిటర్

కుంటూ.... అర్ధరాత్రపుడు జ్వరం వచ్చింది వాడికి. ట్యూషన్ నుంచి రావడం ఆలస్యమయింది నిన్న రాత్రి. శేషాద్రి తొమ్మిది దాకా ఎదురుచూశాడు. ఏడున్నరకల్లా వాడు వచ్చేసి వుండాల్సింది. దేని గురించైనా ఎదురుచూడటం, వేచివుండటం నరకం అనుకుంటాడు శేషాద్రి ఎప్పుడూ. రాత్రి.....

"పిల్లలని కనడం ఒక ఎత్తు, వాళ్లతో పడటం ఒక ఎత్తు. '' అన్నాడు.భార్యతో కోపంగా. వాడిని కనడంలో కేవలం ఆమె ప్రమేయమే ఉన్నట్లు, వాడు ఇల్లుచేరక పోవడంలో పరోక్షంగా ఆమె బాధ్యత ఉన్నట్టు. ఆమె గుండె కూడా నిజానికి బితుకు బితుకు మంటోంది, పైగా ఈ మాటలు.

పంచె ఎగగట్టి, నోట్లో లవంగం వేసుకుని, పాతికపైగా తుపాన్లకు తట్టుకున్న గొడుగును విప్పి పై మొదట్లో పట్టుకుని, ఆకుజోళ్లు తగిలించుకుని రోడ్డు మీదకు వచ్చి నిలబడ్డాడు. వీథిదీపాలు లేవు. వెలుతురు లేని పాడవాటి రోడ్డు మరణానికి అప్రోచ్ రోడ్డులా కనబడింది. చిత్తకార్తె కదా, అంత తుపాను వాతావరణంలోనూ కుక్కలు దేవుళ్లాడుతున్నాయి. వాటి బాధ వాటిది. వాటి సుఖం వాటిది. ఋతుసంబంధమైనదికదా, మనిషిలా కాదు కదా! వాటికి అతివిలువైన కాలం. సరే, వాటి గొడవ అవి పడితే ఎవరికీ అభ్యంతరం లేదు. మన జోలికి రాకుండా. ఎత్తికొడుతోంది గాలి. పంచె సంగతి చూసుకోవాలో, గొడుగు సంగతి చూసుకోవాలో అర్థం కాలేదు. అరకిలోమీటరు వరకు నడిచి కూడలిలో నిలబడ్డాడు. వాడు ఎటునుంచి వస్తాడో చెప్పలేం. నిర్మానుష్యం. అయిదు-పది నిముషాల కు ఒక వాహనం వచ్చేది ...చీకటిని, వర్షాన్ని పరిశోధి స్తున్న సెర్చిలైటుతో. చీకట్లో ఏ ఆకారం కదిలినా, కదిలినట్లనిపించినా కొడుకేమోననుకున్నాడు. కాలినడకన ఒక్కడూ కనిపించలేదు. నిశీధికీ, తుపానుకు కాపలాదారుడిలా నిలబడ్డాడు. తనకు చేతగాని పనిని దేవుడి దయకే కదా ఎవరైనా వదిలి వేసేది? ఆ పనిచేసి, ఇంటికి మరలి వస్తూ దారి పొడుగునా ''వాడు ఈపాటికి ఇల్లు చేరివుంటాడు లే' ' అని సమాధానపడటానికి ప్రయత్నించాడు. వాడు రాలేదు.

ఆ తర్వాత అరగంట కొచ్చాడు తప్పతడిసి. ఆ తడవడం వెంటనే దెబ్బతీసింది. జ్వరం. ఏది ఏమైనా వాడు క్షేమంగా ఇల్లు చేరాడు.

మంచంమీది నుంచి లేచి వీథితలుపు తీయడా నికి ప్రయత్నించాడు. లోకంలోని నక్కల మందల న్నీ ఊళలు పెడుతున్నట్టు వికృతశబ్దం చేస్తోంది చెలరేగుతున్న గాలి. ఉత్తరం దిక్కునుండి పడమటివైపుగా మూడు కొండలు న్నాయి ఒకదాని వెనుక మరొకటి. అవన్నీ సృష్టి ఆదియుగాల నుంచీ ఈ నాటికీ సజీవంగా, కాళ్లు తెగి నడువలేని అసహాయ స్థితిలో ఉన్న జంతువుల్లా తోస్తాయి. ఎక్కడ ఆరం భమవుతుందో తెలీనిగాలి...., నీవు గడ్డిపరకవు అని మనిషిని ఎద్దేవా చేస్తున్నట్టు వీస్తుంది. లక్ష శక్తుల అదృశ్యసైన్యం శూన్యాన్ని ఆక్రమిం చి, ఎవరినో భయపెట్ట డానికి విన్యాసాలు చేస్తున్నట్టుం టుంది. యుగాంతమా? నిజం గా ప్రళయం దాపురించిందా?

పోనీ ఆఫీస్, పోనీ ఆఫీసర్ భ యంకర్. పోనీ ఆఫీస్ సహచరుల్ ...పోనీ దుమ్ముకొట్టి, కుక్క నాలు కలలా, చెవులలా వేలాడే కాగితాల ఫైల్స్....గియిల్స్.. సెలవు పెట్ట వచ్చు రేపు వెళ్లి ....బతికి బాగుంటే.... పోతే సమస్యే లేదు.

వైరాగ్యదృష్టిని అలవర్చుకోవడానికి ప్రయత్నించాడు. దాలిగుంటలో పడుకున్న శనకంలా. తన ఆలోచనలు అప్పుడే తెలిసిపోయినట్లు డిప్యూటీ మేనేజరు ముఖం కనిపిస్తోంది మూసిన కళ్లకు. వాడు భయంకరుడు. వాడు నక్క . చీఫ్ మేనేజరు, డియ్యమ్ చేతిలో చిక్కిపోయాడు. వాడు నక్క ఇంట కట్టేసిన కుక్క. నక్కను మరిగిన కుక్క. ఆ ఒక్క విషయంలో సియ్యమ్‌కి జాతి,కుల,మత, లింగభేదం లేదు. ఆ విధంగా, శునకం అధికారాలు కూడా నక్క చెలాయిస్తూ కింద పనిచేసేవాళ్లను కట్టుబానిసలుగా భావిస్తుంటుందది. వాడి చూపుందే అది ఎవరి చేతనైనా ఒంటేలు పోయించగలదు. నీ వేపే అతగాడు చూసున్నాడనుకుంటావ్. నిజానికి ఏ దూరతీరాలో అది పరికిస్తుంటుంది. ఏ దూరతీరాలో ఆ చూపు పరికిస్తోంది అనుకుంటావ్. అది నిన్ను శల్యపరీక్ష చేస్తుంటుంది. ఆ భగవంతుడు ఎలాంటి నేత్రాలను, చూపునూ సృష్టించాడు! నీ పీకకోసి, నీ తలమార్చి, నవ్వుతూ...."నిజానికి నేను నీ ఆత్మీయుడిని" అని నీతో అనగలడు. అని నమ్మించగలడు. ఏ మాఫియా నాయకుడిగా ఉండవలసిన వాడు. అంతటి చక్కని నేత్రాలు, చూపు సృష్టించిన భగవంతుడి బ్లండర్ వల్ల ...కార్యాలయ అధికారి అయినాడు. ఆగ్రై, ఆగే' పదేపదే గుర్తుకొస్తూ "తెగించి ఆఫీసుకు పోవడమే ఉత్తమం" అని ఊగిసలాడాడు. అయితే అంత దూరం తుపానులో వెళ్లడానికి భయం..... భయం మీద కోపం వచ్చింది.

పెద్దవాడు దగ్గుతూ వార్తాపత్రిక తెచ్చి యిచ్చాడు.

''ఇదెక్కడినుండి వచ్చింది?''అడిగాడు శేషాద్రి.

"మీ పడకగది కిటికీకి వీథివైపు దోపివుంది." అన్నాడు వాడు.

పాపం పేపర్‌బాయ్. వాడిది పెద్దాడి వయసు. పదిహేనో, పదహారో... ఆశాజీవి. రేపు అనేది ఉంటుందని ఇలాంటి ప్రళయకాలంలోనూ నమ్మిన అమాయక జీవి. అలాంటి వాళ్ల వల్లే సృష్టి ముందుకు పోతుంది. తనలాంటి కార్యాలయ పురుగుల వల్లకాదు. సినిక్స్ వల్ల కాదు.

అల్పపీడనం కాస్తా పెనుతుపానుగా మారిందట నిన్న, తొండ ముదిరి నట్లు. ఈ ఊసరవెల్లి ఏ పోకడలు పోతుందో.....కోస్తా జిల్లాలన్నీ జలమయం. ప్రకాశంజిల్లాలో చాలా ప్రాంతాలలో ఒక్క రోజే 26 సెంటీమీటర్ల వర్షం. ఈ రోజు మధ్యాహ్నానికో, రాత్రికో తీరం దాటుతుంది. ఇంతవరకూ వేసిన లెక్క ప్రకారం ప్రాణనష్టం పదిహేను. అది నిజానికి ఎన్నోరెట్లు ఎక్కువగా ఉండవచ్చు. అటు మొన్నటి వరకు వర్షాభావం. కేంద్రబృందం వచ్చి వివరాలు సేకరిస్తుండగా.....పేపరు పక్కన పడేశాడు.

కంటినిండా నిద్రపోయి, కనురెప్పలు విడి, మేల్కొంటూవుండగానే ఆకలీ మేల్కొంటుంది. కాలకృత్యాలు పూర్తి చేసుకోవడం తడువు జఠరాగ్ని రగులుతుంది. ఆకలీ 'ప్రకృతి ధర్మమే!" అగ్నిలా , తుపానులా అదీ ప్రకృతి శక్తి. సృష్టిలోని జీవకోటిని చర్యలకు ప్రేరేపించేది. గాలిలో సర్వవ్యాప్తమై కూడా దృగ్గోచరం కానిది. మహాశక్తి, మహాశాపం"

"పాలపేకెట్లకి పంపావా?"

ఎపుడూ పిల్లలే తెస్తారు.

"పంతులు పడుమన్నారు, ముగ్గురూ.

"అయినా ఇంత గాలి వర్షంలో ఎలా వెళ్లగల రు? " జాలిపడ్డాడు.

"ఒకపని చెయ్యండి."

"ఏమిటి?" భార్య ముఖంలోకి చూసాడు, భయంభయంగా.

"మీరు వెళ్లితెండి ఈరోజు."

"నీ జీవితంలో నా అవసరం పూర్తిగా తీరి పోయినట్లేనా?"

"లేదా, ముఖంకడుక్కొని, టవలుతో ఇంకా తుడుచుకోకుండానే కాఫీ గ్లాసుకు చెయ్యి చాచ కండి."

"ఫ్రిజ్‌లో నిలువవుంటే ఈ పూటకుసర్దు. సాయంత్రం చూచుకోవచ్చు."పురమాయించి, పెరడులోని బాత్రూంకు వెళ్లడానికి దక్షిణపు తలుపు తీసాడో లేదో మొహంమీదికి జల్లుకొట్టింది, ఎప్పుడు తీస్తాడా అని కాచుకుకూచ్చున్నట్లు. తలుపుమూసి లోపలి బాత్రూంలోకి దూరాడు.

బయటకి వచ్చేసరికి ఎవరో హాలువరండాలో మాట్లాడుతున్నారు. ఈ తుపాను అతిధి ఎవరు? హాల్లోకి వచ్చాడు. సిటౌట్లో నిలబడిన మనిషితో హాలుగుమ్మానికి ఇవతలగా నిలబడి మాట్లాడు తోంది లక్ష్మీదేవి. సిటౌట్లో, నిలువెల్లా తడిసినీరు కారుతున్న జేష్టాదేవి. చలికి వణుకుతోంది.

"ఇంత వర్షంలో రాకపోతేనేం ఇలా?"

"గాలికి వానకీ భయపడితే తిండెలా దొరుకు ద్దమ్మా?"

"ఉండేదెక్కడ?"

"సింహాచలం".

"సింహాచలం నుంచి వస్తున్నావా?" గుండె బాదుకుంది లక్ష్మి.

ఇలాంటి వాతావరణంలో అంతదూరం నుంచి ఈ మూలకొండల అంచుకు వచ్చిన తనను చూసి అబ్బురపడుతున్న వ్యక్తి ముందు, గర్వం ఒకవేళ లోపలవున్నా అది కప్పిపుచ్చుకొని, వినమ్రంగా తలవంచుకొని వొణుకుతోంది ఆ సాహసి. చిరిగినచీర. తలమీదనించి మరొక చీర ను దుప్పటిలా కప్పుకొంది. ఎన్నిచీరలైతె ఈ వర్షం నించి రక్షణ ఇస్తాయి? ఇవ్వగలిగినన్ని చీరలు ఈ పేదరాలికి ఇచ్చే కృష్ణుడేడి? తలమీద బుట్ట ఉంచకుంటుంది కాబట్టి కొంతలో కొంత నయమేమో. బుట్టలో కురిసిన వర్షం అక్కడే ఉండిపోదు. క్షణికపు మకాం తర్వాత కిందికి జారిపోతుంది. కాకపోతె, చినుకుల బాదుడుండదు. సరైన ఇల్లూ వాకిలి ఎలానూ ఉండవు. మగవాడి ఆసరా అయినా ఉందో లేదో. ఉన్నా, వాడికి భార్యను సంరక్షించుకోగల శక్తిసామర్ధ్యాలు ఉండివుండవు. ఇద్దరి రెక్కలూ ఆడనిదే ఆకలిజ్వాలలు చల్లారవేమో. తుపానుహోరులో, మూసిన తలుపుల ఇళ్లలోకి కూరలమె కేక వినిపిస్తుందా?

చేతిలోకి తోటకూర కట్టలనించి నీటిని విదిలించి, డబ్బులు ఇవ్వటానికి లోపలకి వెళుతోంది లక్ష్మి. ఆమె వెనుక అతనూ నడిచాడు. తలవెనుకకు తిప్పి, భుజం మీదినుంచి చూస్తూ నవ్వింది.

"మనకు జరుగుబాటువుంది కదా" అన్నాడు.

డబ్బులు తీసుకొని వరండాలోకి వెళ్లింది. అతను మంచం మీద వాలాడు. ఫలహారం తయారుచేస్తున్న చప్పుళ్లు అవుతున్నాయి.

ఆ తోటకూర మనిషికి చావంటే భయం లేదు. తుపానంటే భయం లేదు. రేపన్నా, ఆకలన్నా భయం భయం. అది ఎంతటి భయమంటే....ప్రాణాన్ని కూడా లెక్కజెయ్యనంత. తుపానుకన్నా, చావుకన్నా భయంకరమైనది ఆకలి. తుపాను, ఆకలి ప్రకృతి సిద్ధమైనదే. ఒకటి కనిపిస్తోంది, కనబడదు మరొకటి. కనబడని ఆకలిని కనబడే పదార్థం తీరుస్తుంది. సృష్టిలోని వైపరీత్యాలు, మానవజీవితంలోని పేరడాక్సులు అబ్బురంగా వుంటాయి ఆలోచించే కొలదీ, అనుకున్నాడు. ఫోమ్‌బెడ్డు మీద గుండెలదాకా దుప్పటి కప్పుకుని కళ్లు మూసుకున్నాడు. తన దిశగా వస్తున్న మెత్తటి అడుగులచప్పుడు క్రమంగా, లయబద్ధంగా వినవస్తోంది. ఆగిపోయింది అడుగుల చప్పుడు. కళ్లు తెరిచాడు. పొగలు కక్కుతోంది పళ్లెంలో ఫలహారం. అన్నపూర్ణలా నిలబడివుంది లక్ష్మి. 'జీవితంలో ఏ చింతా నీకు వలదు వత్సా' అని అభయమిస్తున్న దేవతలా ఉంది.

"ఆమెలోని ఆకలి భయం తుపాను భయాన్ని జయించింది. ఒక భయాన్ని అంతకన్నా తీవ్రమయిన మరో భయం కారణంగా జయించగలం...అది సర్వ సాధారణం. కానీ...ఆమే గానీ, నేనేగాని అసలు 'భయం' అన్నదాన్ని జయించలేం కదా! మానవాళిని పీడించే ఆకలీ, భయం సృష్టిలోనే అంతం అవుతాయి"సోక్రటీజ్‌లా అన్నాడు; ఏదో కొత్త జీవితసత్యాన్ని కనిపెట్టిన ఉద్వేగంతో.

అతననంటున్నది అర్థం కానట్లు అయోమయంగా అతని ముఖంలోకి చూస్తూ వుండిపోయింది కొన్ని క్షణాలు. తేరుకుని,సోక్రటీజ్ భార్యలా అంది:

"ఫలహారం చేసిన తర్వాత ఆత్మారాముడు చల్లబడితే, మనసు వెర్రిపోకడలు పోవడం ఆగి, ఇలాంటి తలాతోకాలేని విషయాలు మాట్లాడటం మానేస్తారు. తత్త్వాలు నాకు తెలీవుగాని, మీ లాంటి వాళ్లని 'పడకకుర్చీ తత్త్వవేత్తల'ని అంటారని మాత్రం తెలుసు. అసలూ...జీవితంలో అన్నీ సమకూరివున్నప్పుడే అన్ని భయాలూ....."

